హిమాయత్‌సాగర్ వద్ద 'గేట్ వే ఆఫ్ హైదరాబాద్'

- భారీఎత్తులో ఐకానిక్ టవర్
- సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం



ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ కోర్ అర్బన్ సిటీ ఏరియాలో చేపట్టే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్‌ను బహుళ ప్రయోజనాలుండేలా అత్యంత అధునాతనంగా నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను అదేశించారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు స్వాగతం పలికేలా హైదరాబాద్ ముఖద్వారంగా హిమాయత్‌సాగర్ గాంధీ సరోవర్ దగ్గర ఓఆర్ఆర్‌పై 'గేట్ వే అఫ్ హైదరాబాద్' నిర్మించాలని సూచించారు. ఓఆర్ఆర్‌కు ఒక వైపున ఎకో థీమ్ పార్క్ అభివృద్ధి చేసి మరోవైపున బాపూఘాట్ వైపు భారీ ఐకానిక్ టవర్ నిర్మించాలని చెప్పారు. అందుకు తగిన విధంగా డిజైన్లు రూపొందించాలని సీఎం అదేశించారు. ఓఆర్ఆర్‌కు ఒక వైపున ఉండే ఎకో థీమ్ పార్క్.. మరో వైపున నిర్మించే ఐకానిక్ టవర్‌కు చేరుకునేందుకు ప్రయాణాలకు వీలుగా ఎలివేటెడ్ గేట్ వే నిర్మించి దాన్ని 'గేట్ వే అఫ్ హైదరాబాద్'గా డిజైన్ చేయాలని సూచించారు. బాపూఘాట్ చుట్టూ ఉన్న ఏరియాను వరల్డ్ క్లాస్‌జోన్‌గా అందరిని ఆకట్టుకునేలా డిజైన్ చేయాలని చెప్పారు. హిమాయత్‌సాగర్ దగ్గర అప్రోచ్ రోడ్డు నుంచి అత్తాపూర్ వైపు వెళ్లేందుకు కొత్త ఫ్లైఓవర్ నిర్మించాలనీ, గాంధీ సరోవర్ చుట్టూ ఈ ఫ్లైఓవర్ కనెక్టివ్ కారిడార్‌లా ఉండాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా గాంధీ సరోవర్‌కు చేరుకునేలా ఈ కనెక్టివిటీ ఉండాలన్నారు. గాంధీ సరోవర్ వద్ద నిర్మించే ఐకానిక్ టవర్ పరిస్థితులను బట్టి ప్రపంచంలోనే అత్యంత ఎత్తుగా నిర్మించాలని చెప్పారు.

తాగునీటితోపాటు..

తాగునీటితోపాటు వరద నీటి నిర్వహణకు వీలుగా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్ ఉండాలనీ, వివిధ దేశాల్లో అమల్లో ఉన్న ప్రాజెక్ట్ నమూనాలు పరిశీలించాలని సిఎం చెప్పారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ తాగునీటిని హైదరాబాద్ నగర అవసరాలు తీర్చేందుకు మరింత సమర్థంగా వినియోగించుకునేలా ప్లానింగ్ చేయాలన్నారు. స్థలం వృధా కాకుండా మూసీ పరివాహక ప్రాంతం ఇరువైపులా అండర్‌గ్రౌండ్‌లో భారీగా వాటర్ స్టోరేజీ సంపు నిర్మించే సదుపాయాలు, అక్కడి నుంచి వాటర్ ట్రాన్స్‌పోర్ట్ జరిగేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గాంధీసరోవర్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసే పనులకు వాటర్‌ఫ్లో స్టడీస్ పక్కాగా చేసుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు. రెండు నెలల్లో టెండర్లు పిలిచేందుకు వీలుగా పనుల వేగం పెంచాలని ముఖ్యమంత్రి అధికారులను అదేశించారు.

రేవంత్‌కు రాఖీ కట్టిన మంత్రులు సీతక్క, కొండా సురేఖ

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో గల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో శనివారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖలు సిఎంకు రాఖీలు కట్టారు. రాష్ట్రంలోని మహిళల కోసం అనేక పథకాలను రూపొందించి, అమలు చేస్తున్న సిఎంకు రాఖీలు కట్టటం తమకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని వారు ఈ సందర్భంగా తెలిపారు. మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాత, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు, బిసి కమిషన్, విద్యా కమిషన్, శిశు సంక్షేమాభివృద్ధి కమిషన్, రైతు కమిషన్‌కు చెందిన మహిళా సభ్యులు, ఇతర మహిళా నాయకులు, బ్రహ్మకుమారీస్ బృంద సభ్యులు రేవంత్‌కు రాఖీలు కట్టారు. వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.



సిఎం రేవంత్‌రెడ్డితో సమావేశమైన ఎన్‌టిపిసి సిఎండి

రూ.80 వేల కోట్లు పెట్టుబడులు పెడతాం

- సిఎం రేవంత్‌రెడ్డితో ఎన్‌టిపిసి సిఎండి భేటీ

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుదుత్పత్తి రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టిపిసి) సిఎమ్‌డీ గురుదీప్‌సింగ్ తెలిపారు. శనివారం ఆయన ఆధ్వర్యంలోని ఎన్‌టిపిసి బృందం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసింది. సోలార్, విండ్ విద్యుత్ ప్రాజెక్టుల్లో దాదాపు రూ.80 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా వారు సిఎంకు వివరించారు. ఫ్లోటింగ్ సోలార్ ఉత్పత్తికి సంబంధించి రాష్ట్రంలో 6,700 మెగావాట్ల సామర్థ్యానికి అవకాశం ఉందని వివరించారు. ఈ సందర్భంగా పలు విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాలపై సీఎం రేవంత్‌రెడ్డి వారితో చర్చించారు. ఎన్‌టిపిసికి అన్ని విధాలా సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు.



గుడిసెలను తొలగించేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు

గుడిసెల తొలగింపునకు అటవీ అధికారుల యత్నం

- అడ్డుకున్న ఆదివాసీ గిరిజనులు
- అటవీ ప్రాంతంలో ఉద్రిక్తత
- 35 మందిపై కేసులు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంచిర్యాల జిల్లా సిర్పూర్(యు) మండలానికి చెందిన ఆదివాసీ గిరిజనులు వారం రోజుల కిందట సోనాపూర్‌తండా, పాలగోరి ప్రాంతంలో గుడిసెలు వేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఇంధన్‌పల్లి అటవీశాఖ అధికారులు వాటిని తొలగించే ప్రయత్నం చేశారు. శుక్రవారం సాయంత్రం ఇంధన్‌పల్లి రేంజ్ అధికారి శ్రీధరచారి నేతృత్వంలో రేంజ్ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకొని గుడిసెలు తొలగించే క్రమంలో ఆదివాసీ గిరిజనులు ఎదురు తిరిగారు. కర్రలు, కారంపొడి పట్టుకుని ప్రతిఘటించారు. ఇక్కడి నుంచి వెళ్లేదే లేదంటూ తేల్చిచెప్పారు. దీంతో బేస్ క్యాంపు సిబ్బందిని తరిమే ప్రయత్నం చేయగా.. ఇద్దరు అటవీశాఖ అధికారులు గాయపడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో చేసేదేమీలేక ఫారెస్ట్ సిబ్బంది వెనుదిరిగి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న దండేపల్లి ఎస్ఐ తహసీనొద్దీన్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

35 మందిపై కేసులు

కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని సెక్షన్ ఆఫీసర్ రాజేందర్, బీట్ ఆఫీసర్ సంతోష్‌పై దాడి చేసిన 35 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అనూష తెలిపారు. ఇంధన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గడిపల్లి శ్రీధర్‌చారి ఫిర్యాదులో పేర్కొన్న నేతునూరు, సిర్పూర్(యు)కు చెందిన 35 మంది ఆదివాసీ గిరిజనులు ఇంధన్‌పల్లి రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో అక్రమంగా గుడిసెలు వేశారని తెలుసుకొని ఇంధన్‌పల్లి రేంజ్ ఫారెస్ట్ సిబ్బంది వెళ్లారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో అటవీశాఖ సిబ్బందిపై ఒక్కసారిగా కట్టెలు, కారంపొడితో దాడి చేయడంతో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాజేందర్, బీట్ ఆఫీసర్ సంతోష్ గాయపడ్డారు. దాంతో శ్రీధర్‌చారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సిడాం మోతీరాంతోపాటు 35 మందిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెల్లడించారు.



స్మారకోపన్యాసంలో మాట్లాడుతున్న హరగోపాల్

దేశంలో వైషమ్యాలను పెంచే కుట్ర

- ప్రొఫెసర్ జయశంకర్ స్మారక లెక్చర్‌లో సినీ నటులు ప్రకాశ్‌రాజ్
- విశ్వవిద్యాలయాలు స్వయప్రతిపత్తి కోల్పోతున్నాయి: ప్రొఫెసర్ హరగోపాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో హిట్లర్ వారసుల పాలన కొనసాగుతోందనీ, వారి పట్ల ప్రజాస్వామ్య, లౌకిక వాదులు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ సినీ నటులు ప్రకాశ్‌రాజ్ హెచ్చరించారు. తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో "వైషమ్యాల సుడిలో వైవిధ్య భారతం" అనే అంశంపై శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ స్మారకోపన్యాసం నిర్వహించారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

దేశంలో విభిన్న మతాలు, కులాలు, జాతుల మధ్య వైషమ్యాలు పెంచి పోషిస్తూ అధికార పీఠాన్ని సుస్థిరం చేసుకునేందుకు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆకలి, నిరుద్యోగం, అవినీతి, అక్రమాలు తదితర సమస్యలను కప్పిపుచ్చేందుకు మన ధర్మం, కులం, జాతి ప్రమాదంలో పడిందని ప్రజలను ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆక్షేపించారు. వాటన్నింటి రక్షించే కాంట్రాక్ట్ తమకే ఇవ్వాలంటూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. కొంతమందికి జెనోఫోబియా అనే వ్యాధి పట్టుకుందనీ, వాడు మనవాడు కాదు, వీడు మన జాతి వాడు కాదంటూ నేటి తరం నరనరాల్లో విషాన్ని నింపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ఒకప్పుడు ప్రజా చైతన్యానికి ప్రతీకలుగా ఉన్న విశ్వవిద్యాలయాలు క్రమంగా తమ స్వయంప్రతిపత్తిని కోల్పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాను వైస్‌ఛాన్సలర్‌గా ఉన్న కాలంలో జయశంకర్ కాకతీయ యూనివర్సిటీని గొప్ప విద్యాకేంద్రంగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఒక వైపు తెలంగాణ ఉద్యమకారుడిగా, మంచి విద్యావేత్తగా పాఠాలు చెబుతూ చివరి వరకు నిబద్ధతతో పని చేశారని గుర్తు చేశారు. ప్రముఖ కవి అంపశయ్య నవీన్, ప్రొఫెసర్ శివలింగ్ ప్రసాద్, శ్రీధర్ దేశ్‌పాండేలకు జయశంకర్ స్ఫూర్తి అవార్డులను ఈ సందర్భంగా ప్రకాశ్‌రాజ్, హరగోపాల్‌లు అందజేశారు.

ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయండి

- ఏజెన్సీ ప్రాంతాల్లో ఉచితంగా సోలార్ పంప్‌సెట్లు
- వారం రోజుల్లో అన్ని వివరాలు పంపండి
- కలెక్టర్లకు డిప్యూటీ సిఎం ఆదేశాలు



అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీ భవనం నుంచి రాష్ట్ర సచివాలయం వరకు అన్ని ప్రభుత్వ భవనాలపై సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని డిప్యూటీ సిఎం, ఆర్థిక, విద్యుత్‌శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్ నుంచి ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్‌మిట్టల్, టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫారూఖీ, టిజి రెడ్కో సిఎండి వి అనీల తదితరులు పాల్గొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం అమలును వేగవంతం చేయాలనీ, దానికోసం ఆర్వోఎఫ్ఆర్ భూముల వివరాలు పంపాలని ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం చెప్పారు. రాష్ట్రంలో సోలార్ విద్యుత్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, పార్కింగ్, క్యాంటీన్‌లకు సంబంధించిన మ్యాపింగ్ ప్లాన్లు హైదరాబాద్‌కు పంపాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు అన్నీ ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాదు నుంచే పంపిస్తామని తెలిపారు. దీనికి సంబంధించి కలెక్టర్ కార్యాలయాల్లో మంచి డిజైన్లు ఏవైనా ఉన్నా, వాటిని కూడా కలెక్టర్లు హైదరాబాద్‌కు పంపవచ్చని చెప్పారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి అన్ని జిల్లాల కలెక్టర్లకు ఒక ప్రశ్నావళిని పంపిస్తామనీ, వివరాలు దానిలో నమోదు చేసి, వారంరోజుల్లో విద్యుత్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. ప్రభుత్వ భవనాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల భవనాలపై కూడా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు కోసం ఆయా ప్రభుత్వ భవనాల వివరాలను పంపాలని చెప్పారు. నీటిపారుదల, రోడ్లు భవనాల శాఖల పరిధిలో పెద్ద ఎత్తున ఖాళీ స్థలాలు ఉన్నాయనీ, వాటి వివరాలు కూడా పంపాలని కలెక్టర్లకు సూచించారు.

సోలార్ పంప్‌సెట్లు ఏర్పాటు చేయండి

ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్వోఎఫ్ఆర్ చట్టం కింద 6.70 లక్షల ఎకరాల భూములను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసిందనీ, ఆ భూముల్లో నల్లమల డిక్లరేషన్ ద్వారా ఇందిరా సౌర గిరి జల వికాస పథకాన్ని అమలు చేయాలని డిప్యూటీ సీఎం కలెక్టర్లను ఆదేశించారు. ఈ పథకం ద్వారా ఆయా భూముల్లో ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ పద్ధతిని ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గంలో ప్రారంభించామనీ, ఈ నెలలోనే ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు వారంలోగా పంపాలని చెప్పారు. వీటిపై ఎలాంటి సందేహాలు ఉన్నా విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీతో పాటు విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కంలు) సీఎమ్‌డీలను సంప్రదించాలని సూచించారు.

గిరిజనుల హక్కులను కాపాడుకుందాం

- వారిది ఘనమైన చరిత్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- గిరిజన, ఆదివాసీలతో కలిసి నృత్యం చేసిన సీతక్క
- డప్పు చప్పుళ్లతో హోరెత్తిన కొమరం భీమ్ ఆదివాసి భవన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ ఆదివాసీ దినోత్సవమంటే ఒక పండుగ మాత్రమే కాదనీ, అది వారి హక్కుల్ని కాపాడుకునే దీక్షా దినమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని కొమరం భీం ఆదివాసీ భవన్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లతో కొమరం భీం ఆదివాసీ భవన్ హోరెత్తింది. వివిధ గిరిజన తెగలు తమ సంప్రదాయ కళానృత్య ప్రదర్శనలు ప్రదర్శించాయి. గిరిజన, ఆదివాసీలతో కలిసి పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క బోనమెత్తారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రతి ఏడాది ఆగస్టు 9న జరుపుకుంటారనీ, దీన్ని ధీర దినోత్సవం అని కూడా పిలుస్తారని తెలిపారు. సంస్కృతి సంప్రదాయాలు సహజ వనరుల పరిరక్షణలో ఆదివాసీల పాత్ర మానవజాతి అందించిన అమూల్యమైన జ్ఞానం వారసత్వాన్ని గుర్తించి గౌరవించడమే ఈ దినోత్సవ లక్ష్యమని చెప్పారు. గిరిజనులు, ఆదివాసీలు తినే సజ్జలు కొర్రలు ఇపుడు గొప్ప వాళ్ళు , ధనవంతులు తింటున్నారని తెలిపారు. ఆదివాసీలు సాగు చేసుకునే భూముల జోలికి వెళ్లొద్దని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారని గుర్తు చేశారు. భూముల పై పూర్తి హక్కులు ఉండేలా వారికి పట్టాలు ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 32 గిరిజన తెగలున్నాయనీ, జనాభాలో 9.08శాతం మంది షెడ్యూల్ తెగలున్నారని వెల్లడించారు.

సీతక్క మాట్లాడుతూ... మనం ఎంత ఉన్నత స్థాయికి వెళ్లినా మన పూర్వ స్థితి , అస్తిత్వం మర్చిపోవద్దని చెప్పారు. గతంలో గిరిజనులు, ఆదివాసీల తిండి గురించి చాలా మంది తప్పుగా మాట్లాడేవాళ్ళని గుర్తు చేశారు. పేదోళ్లు వెనుకబడ్డ వాళ్లు తినే తిండి అని హేళన చేసేవారని తెలిపారు. .ఇప్పుడు అదే తిండి స్టార్ హోటళ్లలో రొట్టె, అంబలి బదులుగా సూప్ పేరిట తింటున్నారని చెప్పారు. దీన్ని బట్టి మన పూర్వీకులు ఆహారపు అలవాట్లు ఎంత గొప్పవో అర్థమవుతుందని వివరించారు. డిప్యూటీ స్పీకర్ రాంచంద్ర నాయక్, మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేండ్లుగా ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించిందని ఆరోపించారు. గిరిజన శాఖను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో అశ్వరావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ, ట్రై కార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినెని వీరయ్య, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, కమిషనర్ డాక్టర్ వీఎస్ అలగు వర్షిణి, గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ వి సర్వేశ్వర్ రెడ్డి ట్రైకర్ జిఎం శంకర్‌రావు, జీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి కె సీతలక్ష్మీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌రెడ్డి, పక్కన మంత్రి ఉత్తమ్

27 ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధి

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అందుకనుగుణంగా అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తల నుంచి రూ. 15000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక విధానం రూపొందించిందని చెప్పారు. తద్వారా పర్యాటక రంగంలో మూడు లక్షల ఉద్యోగాలను సృష్టిస్తామని ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లో సదరన్ ట్రావెల్స్ ప్రాంతీయ కార్యాలయాన్ని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ సంవత్సరం మార్చి 17 నుంచి అమలులోకి వచ్చిన 2025-2030 పర్యాటక రంగం విధానాన్ని అమలు చేసి అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణా రాష్ట్రాన్ని టాప్-5 లో ఉంచడమే తమ ముందున్న లక్ష్యమని చెప్పారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడడంతోపాటు పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడం ఈ పాలసీలో భాగమని తెలిపారు. ప్రస్తుతం గుర్తింపు పొందిన పర్యాటక స్థలాలలో మౌలిక సదుపాయాలను వృద్ధి చేయడం, జలపాతాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, వారసత్వంగా గుర్తింపు పొందిన ప్రాంతాలు, ఏకోటూరిజం కేంద్రాలు, వెల్నెస్ కేంద్రాలతో పాటు క్రాఫ్ట్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఇవేగాక మరో 27 ప్రాంతాల్లో పర్యాటక కేంద్రాల ఏర్పాటుకు రూట్ మ్యాప్ రూపొందించినట్లు ఆయన చెప్పారు. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో తెలంగాణకు తలమానికంగా నిలిచిపోయేలా ప్రతిష్టాత్మక ప్రాజెక్టుతోపాటు ప్రాంతీయ రింగ్ రోడ్ల వెంట డ్రై పోర్టులు, గోదావరి, కృష్ణా నదులపై రివర్ బెస్ట్ టూరిజం, నగరాలలో వాటర్ ఫ్రంట్ హబ్‌ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటక సంస్థలు కుటుంబ సభ్యులతో నిర్వహించే యాత్రలకు తెలంగాణ రాష్ట్రం కేంద్రంగా నిలిచేలా ప్రత్యేక విధానం రూపొందించామన్నారు. భారతదేశంలో అత్యంత నమ్మకమైన నెట్‌వర్క్ కలిగినది సదరన్ ట్రావెల్స్ అని అభినందించారు. యాత్రికుల మన్ననలు చూరగొన్న సంస్థగా పేరుతెచ్చుకుందన్నారు.

కెసిఆర్‌కు రాఖీ కట్టిన సోదరీమణులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కెసిఆర్‌కు రాఖీ కడుతున్న సోదరి

రాఖీ పండుగ సందర్భంగా బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్‌కు ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో సోదరీ మణులు లక్ష్మీబాయి, జయమ్మ, వినోదమ్మ రాఖీ కట్టారు. అన్నా చెల్లెళ్లకు, అక్కాదమ్ముళ్ల మధ్య ప్రేమ, గౌరవం, రక్షణలాంటి బంధాలను పెంచే పండుగగా రాఖీని జరుపుకుంటారని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అక్కాచెల్లెల్లందరికీ కెసిఆర్ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

హైదరాబాద్‌లో జోరు వర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్

నగర వాసులను వరుణుడు బెంబేలెత్తిస్తున్నాడు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. సికింద్రాబాద్, తార్నాక, అమీర్‌పేట, ఎర్రగడ్డ, కూకట్‌పల్లి, గచ్చిబౌలి మాదాపూర్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. పెద్దఅంబర్‌పేట నుంచి హైదరాబాద్ సిటీలోకి వెళ్లే రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అయ్యింది. భాగ్యలత ప్రాంతంలో నీరు నిల్వ ఉండిపోవడంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. సైదాబాద్ రెడ్డి కాలనీలో రోడ్లపైకి వర్షపు నీరు వచ్చింది. దీంతో బయటకు వెళ్లేందుకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో రాత్రి 10 గంటల వరకు వెల్లడైన వివరాల ప్రకారం.. బేగంబజార్‌లో అత్యధికంగా 117.5 మి.మీ వర్షపాతం నమోదైంది. సర్దార్ మహల్‌లో 106.3మి.మీ, ఖైరతాబాద్‌లో 94.3 మి.మీ వర్షపాతం నమోదైంది. మరోవైపు రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో అత్యధికంగా 135.5మి.మీ మేర వర్షం కురిసింది.

జల రాజకీయం

- కాళేశ్వరం నివేదికతో మరింత ఊతం
- అసెంబ్లీలో చర్చించాకే చర్యలు
- పంచాయతీ ఎన్నికల తర్వాతే అరెస్టులు ?
- అధికార, ప్రతిపక్షం ఢీ అంటే ఢీ



కుంగిన కాళేశ్వరం బ్యారేజీ (ఫైల్)

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. రోజురోజుకు కాళేశ్వరం కమిషన్ నివేదిక అగ్గిని రాజేస్తున్నది. అధికార, ప్రతిపక్షం మధ్య ఢీ అంటే ఢీ అనే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. పోటాపోటీగా స్పందిస్తున్నాయి. విమర్శలు, ప్రతివిమర్శలతో వ్యక్తిగతంగానూ, పార్టీపరంగానూ ఉద్రిక్తతకు కారణమవుతున్నది. కాళేశ్వరం బ్యారేజీలపై దాదాపు ఏడాదిన్నరపాటు విచారించిన పీసీ ఘోష్ కమిషన్ ఇటీవల సర్కారుకు నివేదికను అందజేసిన సంగతి తెలిసిందే. అన్నీ తానై వ్యవహరించి నిర్ణయాలు తీసుకున్న మాజీ సీఎం కెసిఆర్, హరీష్‌రావు, ఈటల రాజేందర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులూ బాధ్యులని నివేదిక తేల్చింది. ఈనేపథ్యంలో సిఎం, డిప్యూటీ సీఎం, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్, ఇతరులు మీడియాతో మాట్లాడారు. పాత బిఆర్ఎస్ సర్కారుతోపాటు అప్పటి పాలకవర్గాన్ని టార్గెట్ చేశారు. నివేదిక సర్కారుకు అందిన వెంటనే అది తప్పులతడక, అబద్దాల పుట్ట అంటూ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన హరీష్‌రావు, తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కలిశారు. పూర్తిస్థాయి కమిషన్ నివేదిక కాపీ ఇవ్వాలంటూ తన తరపున, కెసిఆర్ తరపున వినతిపత్రాలు సమర్పించారు. దీనిపై అసెంబ్లీలో మాటల యుద్ధం జరిగే అవకాశం లేకపోలేదు. ఇందుకోసం పంద్రాగస్టు తర్వాత వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడం ద్వారా బిఆర్ఎస్‌ను ప్రజల్లో పలుచన చేయాలనే వ్యూహంతో సర్కారు కదలికలు ఉన్నాయి. వాటిని అడ్డుకునేందుకు కెసిఆర్ రంగం సిద్ధం చేసుకుంటున్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో జలరాజకీయం మరింత వేడెక్కనుంది. ఇందుకు అసెంబ్లీ వేదిక కానుంది. అయితే ఈ నివేదికపై పోలీసు సిట్ ఏర్పాటు చేయాలా ? పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టు ఆధారంగానే బాధ్యులపై కేసులు పెట్టి చర్యలకు దిగాలా ? అనే మీమాంసలో ప్రస్తుతం సర్కారు ఉంది. దీనిపై అసెంబ్లీ సమావేశాల్లోగా తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతు భరోసా, ఇతర పథకాల అమలుతో ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత కొంత తగ్గిందనే భావన సర్కారులో నెలకొంది. బిసి రిజర్వేషన్లను కేంద్రం అనుమతించకపోతే, పార్టీ పరంగా రిజర్వేషన్లు అమలుచేయడం ద్వారా పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటాలని రేవంత్ సర్కారు భావిస్తున్నది.



చెట్టుకు కట్టేసి దళిత మహిళపై దాడి

- సిద్దిపేట జిల్లా చేబర్తిలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బూతులు తిట్టిందనే నెపంతో ఓ దళిత మహిళను చెట్టుకు కట్టేసి తీవ్రంగా కొట్టారు. ఈ అమానుష ఘటన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల పరిధిలోని చేబర్తి గ్రామంలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. చేబర్తి గ్రామానికి చెందిన దళిత మహిళ కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ఆవేదన వెలిబుచ్చింది. ఈ క్రమంలో తమనే తిడుతుందన్న అనుమానంతో దళిత మహిళపై చుట్టుపక్కల వారు పలువురు దాడి చేశారు. ఈడ్చుకొచ్చి సావిత్రీబాయి, జ్యోతిరావుపూలే విగ్రహాల వద్ద ఉన్న చెట్టుకు కట్టేసి కొట్టారు. ఈ సంఘటనను చూసిన స్థానికులు కంటతడి పెట్టుకున్నారు. వారిని వారించి బాధితురాలిని విడిపించారు. దాడి చేసిన వారిపై ఎస్సి, ఎస్టి కేసు నమోదు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

గిరిజనులను అడవికి దూరం చేసే కుట్ర

అటవీ సంపదను అదాని, అంబానీలకు దోచిపెడుతున్న కేంద్రం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- మంతన్‌గౌరెల్లిలో ప్రపంచ ఆదివాసీ, గిరిజన హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదివాసీ, గిరిజనుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లిలో శనివారం ప్రపంచ ఆదివాసీ, గిరిజన హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందుగా ప్రపంచ ఆదివాసీ, గిరిజనుల హక్కుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో ఆదివాసీ, గిరిజనుల ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందన్నారు. దీనిపై 2022లోనే ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసిందని గుర్తు చేశారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆదివాసీ, గిరిజన అటవీ సంపదను అదాని, అంబానీలకు దోచిపెడుతోందని విమర్శించారు. దీంతో, వారంతా పేదరికంలోకి నెట్టబడ్డారని, వారి జీవన పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో ఆదివాసీ, గిరిజనులకు కల్పించిన హక్కులను అమలు చేయకుండా ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. దశాబ్దాలుగా అటవీ ప్రాంతంలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను, అందులో ఉన్న ఖనిజ సంపదను మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అప్పగించే కుట్ర చేస్తోందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి




జాన్‌వెస్లీకి రాఖీ కడుతున్న ఐద్వా నాయకులు మౌనిక

78 ఏళ్లు గడిచినా గిరిజనుల సంక్షేమం, జీవన విధానంలో ఆశించిన ఫలితాలు రాలేదని తెలిపారు. నేటికీ గిరిజన తండాలు, గూడాల్లో కరెంటు, పక్కా గృహాలు, తాగునీటి సౌకర్యం లేవన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఆదివాసీ, గిరిజన హక్కుల అమలుకు తమ పార్టీ పోరాడుతోందన్నారు. వెంటనే ఆదివాసీల అభివృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కంట్రోల్ కమిటీ చైర్మన్ డిజి.నరసింహారావు, పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ, నాయకులు ఎస్.చందునాయక్, కె.తావునాయక్, మౌనిక, కందుల శ్రీరాములు, కె.కుమార్, జంగయ్య, భాస్కర్, రవి, గోపాల్ పాల్గొన్నారు.

జాన్‌వెస్లీకి రాఖీ కట్టిన ఐద్వా నాయకురాలు

యాచారం మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లి గ్రామంలో పర్యటించిన జాన్‌వెస్లీకి ఐద్వా నాయకులు మౌనిక రాఖీ కట్టారు. డిజి.నరసింహారావు, పగడాల యాదయ్య, ఆలంపల్లి నరసింహకు రాఖీ కట్టారు. వారు ఆమెకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.



గిరిజన హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు

- టిజిఎస్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వాలు గిరిజన హక్కులను కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కాంగ్రెస్ కాలరాస్తున్నాయని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాంనాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్ వద్ద గల మిధాని తండాలో సంఘం నాయకుడు రామ్‌కుమార్ అధ్యక్షతన ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జెండాను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మానాయక్ ఎగురవేశారు. అనంతరం శ్రీరాంనాయక్ మాట్లాడుతూ..ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవం స్ఫూర్తితో వాటిని కాపాడుకునేందుకు గిరిజన తెగలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆగస్టు తొమ్మిదిన ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆదివాసి గిరిజన తెగలు తమ హక్కుల కోసం గళమెత్తాలని 1994లో ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చిందని గుర్తు చేశారు. కానీ..పాలకులు గిరిజనుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. వారిలో ఐక్యతను దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తామిచ్చిన హామీలపై ప్రశ్నించకుండా ఉండేందుకు ప్రభుత్వాలు పలు రకాల పన్నాగాలు పన్నుతున్నాయని విమర్శించారు. తరతరాలుగా గిరిజనులు కాపాడుకుంటూ వస్తున్న సంస్కృతి, భాష, ఆచారాలపై ఇతర మతాల ప్రభావం పడుతోందనీ, తద్వారా అవి ఉనికి కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2027లో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనాభా లెక్కల పత్రంలో మతం అనే కాలంలో షెడ్యూల్డ్ తెగలు లేదా ప్రకృతి ఆరాధికులు అనే కాలాన్ని చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి మూడ్ బాలు నాయక్, కిషన్ నాయక్, మిదాని తండా అధ్యక్షులు వెంకట్రాం, రవి,శంకర్, బాలు, లక్ష్మణ్, ఎం బాలు, లాల్య,దేశ్యా, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులపై రాజకీయం చేయొద్దు

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో రాజకీయ జోక్యం తగదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని భావించాలని హితవుపలికారు. పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కమిషన్ నివేదికపై అఖిలపక్షాన్ని పిలిచి ప్రజలందరికీ తెలిసేలా నిజానిజాలు వివరించాలని కోరారు. బనకచర్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎటూ తేల్చకుండా ఇరు రాష్ట్రాల మధ్య తగువపెట్టేలా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయకపోవడంతో ఎస్టిమేషన్లు పెరిగి ప్రజాధనం దుర్వినియోగం అవుతోందన్నారు.

బనకచర్ల ప్రాజెక్టు విషయంలో జలవనరుల శాఖ, కేంద్ర ప్రభుత్వం, ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు సాంకేతికంగా.. నికరజలాలు, మిగులు జలాలపై తేల్చిన తర్వాతే ముందుకు పోవాలని సూచించారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని లిఫ్టులన్నీ ప్రాజెక్టు అంతర్భాగంగా చూడాలని, పూర్తి నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని చెప్పారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టు పనులను పూర్తిచేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా అందుబాటులో ఉంచాలన్నారు. గిరిజనులు, గిరిజనేతరులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్యా పాండునాయక్, పల్లె వెంకటరెడ్డి, వట్టెలపు సైదులు, మండల కార్యదర్శులు మాలోత్ బాలునాయక్, పోసనబోయిన హుస్సేన్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శీలం శ్రీను, అంజి ఉన్నారు.

ఆన్‌లైన్‌లో 'ఇండ్ల' సమాచారాన్ని తెలుసుకోవచ్చు

హౌసింగ్ కార్పొరేషన్ ఎండి విపి గౌతం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఇందిరమ్మ ఇండ్ల సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎమ్‌డీ విపి గౌతం తెలిపారు. లబ్దిదారులు నేరుగా ఆన్‌లైన్‌లోనే తమ వివరాలను తెలుసుకునేలా ప్రభుత్వం వీలు కల్పించిందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ఉన్న వెబ్‌సైట్‌లో ఈమేరకు మార్పులు చేసినట్టు తెలిపారు. లబ్ధిదారులు కార్యాలయాలకు వెళ్లకుండా తమకు కావల్సిన సమాచారాన్ని ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌లో చూసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. https://indirammaindlu.telangana.gov.in/ వెబ్‌సైట్ ద్వారా లబ్ధిదారుల ఫోన్, ఆధార్, రేషన్ కార్డు నంబర్లు, అప్లికేషన్ నెంబర్లలో దేనితోనైనా సమాచారాన్ని చూసుకోవచ్చని ఆయన వివరించారు. వెబ్‌సైట్‌లో సమాచారాన్ని తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ, హిందీ భాషల్లో అందుబాటులో ఉంచారు.

ఆన్‌లైన్‌లో ఇలా చూసుకోవచ్చు

https://indirammaindlu.telangana.gov.in/ అనే వెబ్‌సైట్‌లో 'అప్లికేషన్ సెర్చ్' బటన్‌పై క్లిక్ చేయాలి. అందులో 'సెర్చ్ బై' అనే దానిపై క్లిక్ చేసి, ఆధార్, మొబైల్ తదితర వాటిలో దేని ఆధారంగా సమాచారం కోరుకుంటున్నారో, ఆ వివరాల ఆధారంగా, పూర్తి సమాచారం స్క్రీన్‌పై కనిపిస్తుంది.



మల్లారెడ్డికి రాఖీ కడుతున్న ముస్లిం సోదరి

ఏ పార్టీ వైపూ చూసే అవసరం లేదు

- రాజకీయాలకు దూరంగా ఉండి ప్రజలకు సేవ చేస్తా..
- ఎమ్మెల్యే మల్లారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 73 సంవత్సరాల వయస్సులో బిజెపి, టిడిపి.. వేరే ఇతర పార్టీల వైపు చూసే అవసరం తనకు లేదన్నారు. అసలు రాజకీయమే వద్దనుకుంటున్నానని హాట్ కామెంట్స్ చేశారు. శనివారం రాఖీ పౌర్ణమి సందర్భంగా హైదరాబాద్ బోయిన్‌పల్లిలోని తన క్యాంప్ కార్యాలయానికి వచ్చిన నియోజకవర్గ మహిళలు పలువురు ఆయనకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. తాను ఇప్పుడు బిఆర్ఎస్‌లో ఉన్నానని, ఏ పార్టీ వైపు చూసే పరిస్థితి లేదన్నారు. ఎంపీగా, మంత్రిగా పనిచేసి ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నానని, మరో మూడు సంవత్సరాలు తన పదవీకాలం ఉందన్నారు. రాజకీయాలకు దూరంగా ఉండి ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. మరిన్ని కాలేజీలు, యూనివర్సిటీలు నడిపిద్దామనుకుంటున్నానని తెలిపారు. గతంలో రాఖీ పౌర్ణమి రోజే తన తొలి ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభించినట్టు గుర్తు చేశారు. త్వరలోనే ఉత్తరప్రదేశ్ వెళ్లి అక్కడి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కలిసి 50 ఎకరాల్లో హెల్త్ సిటీ ప్రారంభిస్తానని తెలిపారు. అంతేకాకుండా బీహార్, పశ్చిమబెంగాల్, వైజాగ్ ఇలా దేశంలోని ముఖ్య పట్టణాల్లో యూనివర్సిటీలు ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బెట్టింగ్‌లో డబ్బులు పెట్టి నష్టపోయిన ఓ వికలాంగ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున నలగొండ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన వికలాంగుడు ఎర్రబెల్లి యాదగిరిరెడ్డి కుమారుడు ప్రవీణ్‌రెడ్డి(27) తనకు వచ్చే పెన్షన్ డబ్బులను బెట్టింగ్‌లో పెట్టేవాడు. ఆ డబ్బులు సరిపోక అప్పు చేసి మరీ బెట్టింగ్‌లో పెట్టి పోగొట్టుకున్నాడు. చేసిన అప్పులను తీర్చలేక మనస్తాపానికి గురై నల్లగొండ రైల్వే బ్రిడ్జి వద్ద శనివారం తెల్లవారుజామున రైలు కింద పడ్డాడు. అప్పుడే మూమెంట్ కావడం వల్ల డ్రైవర్ గమనించి బ్రేక్ వేశాడు. కానీ అప్పటికే అతను రైలు కిందికి వచ్చాడు. రైలు ఇంజిన్ పట్టాల మధ్య ఇరుక్కుపోయిన ప్రవీణ్‌రెడ్డిని ఆర్‌పీఎఫ్ సిబ్బంది బయటికి తీసి జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కానీ పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. ఈ మేరకు జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేశారు.

బిజెపి అనుబంధ విభాగంగా ఎన్నికల సంఘం

- టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిజెపి అనుబంధ సంఘంగా కేంద్ర ఎన్నికల సంఘం మారిందని టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్‌గౌడ్ ఆరోపించారు. ఎన్‌డిఎ పక్షాల కంటే విపక్షాలపై ఇడి ఎక్కువగా కేసులు నమోదు చేసిందని విమర్శించారు. ఇడిని అడ్డం పెట్టుకుని బిజెపి విపక్షాలను భయాందోళనకు గురి చేస్తున్నదని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఇష్టాగోష్టిగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏఐసిసి ఆదేశాల మేరకే జనహిత పాదయాత్ర చేస్తున్నామని తెలిపారు. బిసి రిజర్వేషన్ల సాధన కోసం ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించామని చెప్పారు. అనివార్య కారణాల వల్ల ఆ ధర్నాకు ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రాలేకపోయారని తెలిపారు. సిఎంపై ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, అనిరుద్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఏఐసిసి దృష్టి సారించిందని చెప్పారు. ఇప్పటికే అనిరుద్‌రెడ్డి నుంచి వివరణ కూడా తీసుకున్నట్టు తెలిపారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. అవినీతి అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం పద్ధతి ప్రకారం ముందుకు పోతున్నదని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు, ఫోన్ ట్యాపింగ్‌పై సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేస్తున్న విమర్శలు అర్థరహితమని చెప్పారు. పదేండ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానంటూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి తప్పులేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచేందుకు అలా మాట్లాడి ఉంటారని ఈ సందర్భంగా వివరించా రు. రాష్ట్రంలో బిసి రిజర్వేషన్ బిల్లుకు మద్దతిచ్చిన బిజెపి...కేంద్రంలో మాత్రం ఆ బిల్లును అడ్డుకుం టున్నదని విమర్శించారు. నాలుగుగైదు రోజుల్లో పిఎసి సమావేశం నిర్వహించి పదవులపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. బిసి రిజర్వేషన్ల అంశంపై తగిన నిర్ణయం తీసుకుం టామన్నారు. సీఎం రేవంత్‌కు, తనకు మధ్య విభేదాలున్నట్టు జరుగుతు న్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు.

సంచలనాల కోసమే బండి వ్యాఖ్యలు

- బిఆర్ఎస్ నేత రావుల శ్రీధర్ రెడ్డి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలనాల కోసం పాకులాడుతున్నారని బిఆర్ఎస్ సీనియర్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సాక్షిగా హాజరైన ఆయన అవాకులు చెవాకులు మాట్లాడారని ఎద్దేవా చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రావుల మాట్లాడుతూ... సంజయ్ లాంటి వాళ్ల వల్ల కేంద్ర మంత్రివర్గంపై నమ్మకం పోతోందని విమర్శించారు. సిట్ విచారణ కు హాజరైన ఆయన ఊరేగింపుగా రావడం హాస్యా స్పదమని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రిగా రాష్ట్రానికి ఒక్కపైసా తీసుకురాలేని ఆయన ఉత్సవాలు చేసుకోవటం విడ్డూరంగా ఉందన్నారు. కెసిఆర్, కెటిఆర్ గురించి అడ్డగోలుగా మాట్లాడుతున్న సంజయ్... పార్లమెంటులో తెలంగాణ అభివృద్ధి గురించి ఎందుకు నోరెత్తటం లేదని ప్రశ్నించారు.

వైద్య విద్యార్థుల భవితవ్యం.. అగమ్య గోచరం

- భద్రత కరువు.. కొరవడిన హాస్టల్ సౌకర్యం
- విద్యుత్, తాగునీటి కనెక్షన్ లేని వైనం
- పూర్తికాని కళాశాల భవనాలు
- సెప్టెంబర్ 2 నుంచి ఫైనల్ పరీక్షలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. కళాశాల ప్రారంభించి మూడేండ్లయినా కనీస సౌకర్యాలు లేకపోవడం, ముఖ్యంగా హాస్టల్ వసతి కొరవడటంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. సెప్టెంబర్ 2వతేదీ నుంచి వార్షిక పరీక్షలున్న నేపథ్యంలో హాస్టల్ సౌకర్యాలు లేక కొందరు విద్యార్థినులు ఇంటి బాట పట్టడం ఆందోళన కలిగిస్తోంది. 2022 నవంబర్‌లో వైద్య కళాశాలను ప్రారంభించినప్పుడు ఆరు నెలల్లో హాస్టల్ సౌకర్యాలు కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అయితే.. మూడేండ్లు గడిచినా ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. 30 ఎకరాల విస్తీర్ణంలో వైద్య, నర్సింగ్ కళాశాలలు, ఆస్పత్రి, హాస్టల్స్, కిచెన్, డైనింగ్ హాల్ వంటివి నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రస్తుతం నర్సింగ్ కళాశాల భవనంలోనే వైద్య కళాశాల తరగతులు నిర్వహిస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌కు 150మంది చొప్పున ప్రస్తుతం మూడు బ్యాచ్‌లకు కలిపి 450 మంది వైద్య విద్యార్థులు ఉన్నారు. సోమవారం నుంచి మరో బ్యాచ్ (2025-26)కు కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. కానీ, సౌకర్యాలలేమితో విద్యార్థుల చదువులు ఎలా సాగుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. కళాశాల నుంచి 4 కి.మీ దూరంలో ఉన్న ప్రయివేట్ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు ప్రతిరోజూ ఆటోల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఇది వారికి ఆర్థికంగా, శారీరకంగా ఇబ్బందులను కలిగిస్తోంది. అంతేకాకుండా, కళాశాల నుంచి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి వెళ్లడం, రావడం వల్ల సమయం వృథా అవుతుందని, చదువుకోవడానికి తగినంత సమయం దొరకడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం గతంలో జెఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలోని మూడు గదుల్లో హాస్టల్‌ను ఏర్పాటు చేశారు. అయితే, కొత్త బ్యాచ్ విద్యార్థులు వస్తున్నారన్న కారణంతో ఇటీవల వారిని బలవంతంగా ఖాళీ చేయించారు. పరీక్షల భయంతో, హాస్టల్ లేక దారి తోచని ఆ విద్యార్థులు తమ సొంత ఊళ్లకు వెళ్లిపోయారు. కొత్తగా నిర్మించిన హాస్టల్ భవనాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నప్పటికీ, విద్యుత్, తాగునీటి కనెక్షన్లు ఇంకా ఇవ్వలేదు. గత నెల 25న ఎమ్మెల్యే మురళి నాయక్ వారం రోజుల్లో హాస్టల్ ప్రారంభిస్తామని చెప్పినా, ఇప్పటికీ ఎలాంటి పురోగతి లేదు. 2022 నవంబర్‌లో కెఎంవి ప్రాజెక్ట్ కింద కళాశాల భవనాల కోసం రూ. 116 కోట్లు కేటాయించినా.. హాస్టల్స్, మెడికల్ కళాశాల, క్వార్టర్స్, ఆస్పతి నిర్మాణాలు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రారంభోత్సవానికి తేదీ నిర్ణయిస్తే పనులు వెంటనే పూర్తి చేసి, డిసెంబర్ మొదటి వారం నాటికి కళాశాల అప్పగిస్తామని కెఎంవి మేనేజర్ చెబుతున్నారు. కాగా, పరీక్షలు ఉన్నందున నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేసి, హాస్టల్స్ తమకు అప్పగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

బతుకుకు భద్రత లేదు : దమయంతి, మెడికల్ విద్యార్థిని

తల్లిదండ్రులను వదిలి చదువు కోసం వచ్చాం. ఇక్కడ మాకు బతుకు భద్రత లేదు. ప్రయివేట్ హాస్టళ్లలో ఉంటున్నా సరైన భోజనం కూడా దొరకడం లేదు. ప్రాక్టికల్స్‌కు గ్రామాలకు వెళ్లడం, కాలేజీకి రవాణా సౌకర్యాలు లేక ఆటోల్లో తిరుగుతున్నాం. ప్రమాద భయం వెంటాడుతోంది. వెంటనే మాకు హాస్టల్ భవనాలు కేటాయించాలి.

లైబ్రరీనే క్లాస్ రూమ్‌గా..: దినేష్, మెడికల్ విద్యార్థి

2022లో చేరినప్పుడు ఆరు నెలల్లో హాస్టల్స్ ఇస్తామన్నారు. మూడేండ్లయినా అతీగతీ లేదు. పూర్తిస్థాయి తరగతి గదులు లేక లైబ్రరీని క్లాస్ రూమ్‌గా వాడుకుంటున్నాం.

బలవంతంగా ఖాళీ చేయించారు : అనూష, మెడికల్ విద్యార్థిని

సెప్టెంబర్ 2 నుంచి పరీక్షలు ఉన్నా తమను బలవంతంగా ఖాళీ చేయించారు. కొత్త హాస్టల్ భవనాలు నెల రోజుల్లో పూర్తయ్యేలా కనిపించడం లేదు.

నూతన విత్తన చట్టం సిద్ధం!

- ప్రతిపాదనలపై రైతు కమిషన్ కసరత్తు పూర్తి
- రైతు నష్టపోతే కంపెనీలదే బాధ్యత
- కల్తీ విత్తనాలు అమ్మితే ఊసలు లెక్కించాల్సిందే.!
- పలు సంఘాలు, నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న కమిషన్
- అసెంబ్లీ సమావేశాల్లో ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపే అవకాశం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ నూతన విత్తన చట్టం సిద్ధమవుతున్నది. ఆ చట్టంలో ప్రతిపాదనలు ఎలా ఉండాలనే దానిపై విత్తన చట్టం కమిటీ కసరత్తు పూర్తి చేసింది. నకిలీ, కల్తీ విత్తనాలతో రైతులు భారీగా నష్టపోతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు కమిషన్ నూతన విత్తన చట్టం రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రైతు సంఘాలు, మేధావులు, వ్యవసాయ నిపుణులు, రైతుల అభిప్రాయాలను సేకరించింది. మహారాష్ట్ర, కర్ణాటకలతోపాటు ఇతర రాష్ట్రాల్లో అమలులో ఉన్న విత్తన చట్టాలను పరిశీలించింది. చట్టంలో ఉండాల్సిన అంశాలపై ఇప్పటికే పలు సూచనలు, సలహాలు తీసుకుంది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి అభిప్రాయాలను సేకరించింది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో నూతన విత్తన చట్టం ముసాయిదాను ఆమోదించే అవకాశం ఉన్నది. ఆ దిశగా రైతు కమిషన్ కసరత్తు చేస్తోంది.

విత్తన చట్టం అవసరమేంటి?

రాష్ట్రంలో ప్రతియేటా ఏదో ఒక చోట రైతులు కల్తీ విత్తనాలతో పెద్ద ఎత్తున నష్టపోతున్నారు. ఒక సీజన్‌లో రైతు పంట నష్టపోతే ఆ ఏడాదంతా వారిని కష్టాలు వెంటాడుతుంటాయి. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీరవు. ఆ అప్పులు చెల్లించలేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. చివరకు అన్నదాతలు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంటున్న పరిస్థితులు చూస్తూనే ఉన్నాం. నాణ్యమైన విత్తనం ద్వారానే పంట ఉత్పత్తి కూడా పెరుగుతుంది. కానీ అదే విత్తనం నకిలీదైతే ఆ పంట మొత్తం దెబ్బతింటుంది.కానీ నాణ్యమైన విత్తనాలను అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. దీంతో విచ్చలవిడిగా ప్రయివేటు కంపెనీలు పుట్టుకొస్తున్నాయి. కంపెనీలకు, రైతులకు సంబంధం లేకుండానే థర్డ్ పార్టీ ద్వారా విత్తనాల అమ్మకం, కొనుగోళ్లు జరుగుతున్నాయి. దీంతో పంట నష్టపోతే తమకు సంబంధం లేదన్నట్టు కంపెనీలు వ్యవహరిస్తున్నాయి. విత్తనం అమ్మిన కంపెనీలు చేతులెత్తేస్తున్నాయి. జోగులాంబ గద్వాల, ఆదిలాబాద్ జిల్లాల్లో పత్తి విత్తనాలతో రైతులు రూ. వంద కోట్లు నష్టపోతున్నారు. విత్తనం కొనేటప్పుడు కంపెనీలు నమ్మబలుకుతున్నాయి. కానీ పరిహారం చెల్లించాలని అడిగితే మాత్రం తప్పించుకుంటున్నాయి. ఆ విత్తన ప్యాకెట్ ఎక్కడ కొన్నారో చూపించాలి. పంట పూర్తయ్యేవరకు ఆ కవర్ దాచిపెట్టాలి. పంట నష్టపోతే ఆ కవర్ పట్టుకుని వెళ్లి చూపిస్తేనే... ఆ కంపెనీలు దయదల్చిస్తేనే ఎంతిస్తే అంతే తీసుకోవాలి తప్ప న్యాయపరంగా అడిగే హక్కు రైతుకు లేదు. నష్ట పరిహారం చెల్లించాల్సి వస్తుందన్న కారణంగా కంపెనీలు ముఖం చాటేస్తున్నాయి. రైతులు మాత్రం కంపెనీ ఆర్గనైజర్ల చుట్టూ చెప్పులరిగే తిరగాల్సి వస్తోంది. అయినా పరిహారం అందడం లేదు. ఇటీవల ములుగు జిల్లాల్లో మొక్కజొన్న పంట విషపూరితమైంది. అది తిన్న పశువులు చనిపోయాయి. రైతులు అనారోగ్యం పాలయ్యారు. రాష్ట్రంలో ప్రతి సీజన్‌లో ఇలాంటి ఉదారహణలెన్నో ఉన్నాయి.

నూతన విత్తన చట్టంలో ఏముంది?

ఈ క్రమంలో ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విత్తన చట్టాలను రైతు కమిషన్ పరిశీలించింది. రాష్ట్రంలో బలమైన, సమగ్రమైన విత్తన చట్టం తేవాలని నిర్ణయించింది. రైతులను మోసం చేస్తే ఎవరికైన కఠిన చర్యలు తప్పవనేలా ఆ చట్టంలో నిబంధనలు పొందుపరిచారు. నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులతో రైతులు మోసపోతే వారికి విత్తన కంపెనీల నుంచే నష్ట పరిహారం వచ్చేలా ప్రభుత్వం నిబంధనలను రూపొందించింది. అక్కడితోనే ఆగకుండా కంపెనీలపై జరిమానా విధించడం, బాధ్యులకు జైలు శిక్ష పడేలా సర్కారు చట్టాన్ని తీసుకురాబోతుంది. ఒక్కో పంటకు ఒక్కో రకంగా పరిహారం చెల్లించేలా ముసాయిదాలో నిబంధనలను రూపొందించారు. ఈ రకంగా పంట సీజన్ (ఆరునెలలు) పూర్తయ్యాక పంట నష్టపోతే రైతుకు వంద శాతం నష్టపరిహారం అందించేలా కఠిన నిబంధనలు పెట్టినట్టు తెలిసింది. పంట కాలం, పెట్టుబడి, రైతు కష్టాన్ని పరిగణనలోకి తీసుకుని పరిహారం అందేలా చట్టాన్ని తీసుకరానుంది. సీజన్ మధ్యలో పంటనష్టం వాటిల్లినట్టు తెలీతే 50 శాతం, విత్తనాలు వేసిన మొదట్లో దెబ్బతింటే 10 నుంచి 20 శాతం నష్టపరిహారం ఇవ్వాలనేది నిబంధన.

కార్పొరేట్ కంపెనీలను ఈ చట్టం ఎదుర్కొగలదా?

రాష్ట్రంలో విదేశీ, స్వదేశీ కార్పొరేట్ విత్తన కంపెనీలు పాగ వేస్తున్నాయి. పత్తి విత్తనంపై వాటిదే ఆధిపత్యం. కార్పొరేట్ విత్తన కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం సహకారం ఉన్నది. అందుకు అనుగుణంగా మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. రైతుల ఒత్తిడి ఫలితంగా కేంద్రం ఆ చట్టాలను రద్దు చేసింది. కానీ పరోక్షంగా వాటిని బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నట్టు రైతులు సంఘాలు అంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న నూతన విత్తన చట్టం...ఆ కార్పొరేట్ విత్తన కంపెనీలను నియంత్రించగలదా? ఆ కంపెనీలు ఈ చట్టం నిబంధనలు అమలు చేస్తాయా? కార్పొరేట్ సీడ్ కంపెనీలను ఈ చట్టం ఎంత వరకు నియంత్రించగలదో వేచి చూడాల్సిందే.